గౌరవెల్లికి గోదారి వచ్చేనా?

- మెట్ట ప్రాంత రైతుల ఎదురుచూపు
- కాలువల కోసం భూ సేకరణ చేస్తున్న అధికారులు

6లో


సందర్శకులు లేక వెలవెలబోతున్న మ్యూజియం

ఈ చరిత్ర ఏ సిరాతో..!

చెదలు పట్టిస్తున్నారు..

- 85 ఏళ్ల క్రితం మ్యూజియం ఏర్పాటు
- మరమ్మతుల పేరిట మూసివేత
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో విలువైన సంపద
- ఏడాదిగా పట్టించుకునేవారు కరువు..
- అసలున్నాయో.. లేవో.. పట్టని పురావస్తుశాఖ



7లో

ఆగని వాన


పొంగిపొర్లుతున్న నారాయణపేటలోని పెద్ద చెరువు

- జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండుకుండల్లా మారిన చెరువులు
- పలు ప్రాంతాల్లో పాక్షికంగా కూలిన ఇళ్లు
- పత్తాలేని వైద్యశాఖ అధికారులు

సిద్దిపేట జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. శనివారం సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 48.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. సిద్దిపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు జలమయంగా మారాయి. శిథిలావస్థకు చేరిన పలు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. కాలనీల్లోకి మోకాల్లోతు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదర్కొన్నారు. రహదారుల్లో నిలిచిన నీటిని మున్సిపల్ అధికారులు జేసీబీ వాహనంతో తొలగించారు. వర్షానికి తొగుట మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన మల్లవ్వ, చందాపూర్ గ్రామానికి చెందిన రాజవ్వ, వర్గల్ మండలంలోని షైలారం గ్రామానికి చెందిన నర్సమ్మ ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. నారాయణరావుపేట మండలంలోని

- మిగతా 8వ పేజీలో...


గజ్వేల్ పట్టణంలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శరత్

అప్రమత్తంగా ఉండాలి

- వానలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ శరత్

గజ్వేల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వానల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఏ.శరత్ సూచించారు. శనివారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఆయన కలెక్టర్ హైమావతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శరత్ మాట్లాడుతూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువల వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థకుచేరిన ఇళ్లను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా అదన కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హత్నూర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం దౌల్తాబాద్ పట్టణంలోని పలువు ఎరువుల దుకాణాలను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఏ.శరత్ తనిఖీచేశారు. ఆయన వెంట డీఏవో శివప్రసాద్, జోగిపేట ఏడీఏ రమాదేవి తదితరులు ఉన్నారు.

రంగనాయకసాగర్‌పై రన్నింగ్

- నేడు థర్డ్ ఎడిషన్ హాఫ్ మారథాన్

చిన్నకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రన్నింగ్ కార్యక్రమాలకు చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ వేదికగా మారుతున్నది. 2023లో ఫస్ట్ ఎడిషన్ హాఫ్ మారథాన్, గతేడాది సెకండ్ ఎడిషన్ హాఫ్ మారథాన్ ఇక్కడే నిర్వహించగా, ముచ్చటగా మూడోసారి ఆదివారం నిర్వహించే థర్డ్ ఎడిషన్ హఫ్ మారథాన్‌కూ ఇదే వేదిక కానుంది. 21కే, 10కే, 5కే రన్‌ను నిర్వహించనున్నారు. మంత్రి వివేక్‌వెంకట స్వామి, ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, హిరో సంపూర్ణేశ్ బాబు, జిల్లా అధికారులు హాజరుకానున్నట్లు సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు తెలిపారు.



రంగనాయకసాగర్ కట్టపై రన్నర్స్ (ఫైల్)

ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారునుల ఆదేశించారు. శనివారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలోని నాలుగో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఇసుక కొరత ఉందని కొందరు మంత్రి దృష్టికి తీసుకురాగా ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముందుగా కాలనీల్లో పర్యటించి మురుగు కాలువలు, రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చెర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, నాయకులు పాల్గొన్నారు


లబ్ధిదారుడితో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్


అస్మిత యోగాసన పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి

అస్మిత యోగం

- యోగాసన పోటీలకు వేదిక కానున్న సిద్దిపేట
- ఎస్ఏఐ ఆధ్వర్యంలో ఆగస్టు 2న పోటీలు
- దేశంలో 50 నగరాలల్లో సిద్దిపేట ఎంపిక

సిద్దిపేట కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అస్మిత యోగాసన పోటీలకు సిద్దిపేట సిద్ధమవుతుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఆగస్టు 2న దేశంలోని 50 నగరాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా లీగ్ పోటీలను సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ హైమావతి శనివారం ఆవిష్కరించారు. అస్మిత (అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ థ్రూ యాక్షన్) యోగాసన పోటీలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. రాష్ట్రంలోని యోగాసన సాధకులు (బాలికలు, మహిళలు) ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. 18 ఏళ్లలోపు బాలికలకు, 18 సంవత్సరాలు పైబడిన మహిళలు విభాగాల్లో పోటీలుంటాయి. అసక్తి కలిగినవారు గూగుల్ ఫామ్ నింపాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 6302227030 నెంబర్‌ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి : కలెక్టర్

గజ్వేల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎరువులు అందించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆమె శనివారం రాత్రి తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, రిజిస్టర్‌లో రైతులకు ఎరువులు అందించే వివరాలను రాయాలని సూచించారు. భూమి సాగు చేసే రైతులకే ఎరువులు ఇవ్వాలన్నారు ఆమె వెంట వ్యవసాయ శాఖ జిల్లా అధికారి స్వరూపరాణి, వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, వ్యవసాయ శాఖ మండలాధికారి నాగరాజు ఉన్నారు.

సర్కార్ బడిలో చేరితే సైకిల్ ఉచితం

- నేను ఎంపీగా ఉన్నంత కాలం పంపిణీ చేస్తా
- మంత్రి పొన్నంతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బండి సంజయ్

హుస్నాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదవండి.. బహుమతిగా సైకిల్‌ను పొందండి అంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తాను ఎంపీగా ఉన్నంత కాలం ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తానని ప్రకటించారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరిట సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నర్సరీ నుంచి 6వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మోది కిట్స్ పంపిణీ చేస్తామన్నారు.రాజకీయాలకు అతీతంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో త్వరలోనే నవోదయ స్కూల్ ఏర్పాటు చేసి వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హుస్నాబాద్ మున్సిపల్‌కు జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామ్మూర్తి, ఎంఈవో మనీల, కమిషనర్ మల్లిఖార్జున్, రంగా, బీజేపీ నాయకులు ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షులు శంకర్‌బాబు, దొడ్డి శ్రీనివాస్, ఖమ్మం వెంకటేశ్, మహేందర్ రెడ్డి తదితరులున్నారు.


ఆలయ ముఖమండపంలో నిల్వ ఉన్న వర్షపు నీరు

ముఖ మండపం స్లాబ్ లీక్

కొమురవెల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ముఖ మండపం స్లాబ్ ఊరుస్తున్నది. దీంతో భక్తులు స్వామివారికి పట్నాలు రచించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ నాసిరకం పనులతోనే స్లాబ్ లీకవుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆలయాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.


స్లాబ్ నుంచి లీకవుతున్న నీరు

గ్రామాలను పట్టించుకోరా?

- కుంగిన మురికి కాలువ స్లాబ్
- చేతులు దులుపుకుంటున్న కార్యదర్శులు
- పట్టించుకోని అధికారులు

8లో

డిగ్రీ ప్రవేశాలకు లాస్ట్ ఛాన్స్

- దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 31తో ముగియనున్న అడ్మిషన్ ప్రక్రియ



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్

సిద్దిపేట కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీలో అడ్మిషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 3 విడతలు పూర్తికాగా, తాజాగా ఫైనల్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఇందులో భాగంగా వెబ్ ఆప్షన్స్ కోసం ఈ నెల 31 వరకు అవకాశమిచ్చారు. ఆగస్టు 3న సీట్ అలాట్మెంట్ ఉండగా, 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడంతోపాటు సీసీవోటీపీతో వ్యక్తిగతంగా కళాశాలను సందర్శించి ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోయినా, కళాశాలకు వెళ్లకపోయినా సీటు రద్దవుతుంది. మూడు విడతల్లో అడ్మిషన్ పొందని విద్యార్థులు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించకుండా స్పెషల్ ఫేజ్‌లో పాల్గొనవచ్చునని డాక్టర్ కె. భాస్కర్, దోస్త్ కోఆర్డినేటర్ తెలిపారు. అసలు రిజిస్ట్రేషన్ చేయని విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించి పాల్గొనాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా కళాశాలలో ఏర్పాటుచేసిన జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్నాళ్లీ సాగుదీత

- మెట్టభూములకు అందని మల్లన్నసాగర్ జలాలు
- డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనుల్లో జాప్యం
- ఆందోళన బాటపట్టిన అన్నదాతలు
- గ్రావిటీ సౌకర్యం లేని భూములకు 'ఇఫానెట్'తో నీరు

తొగుట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ కాలువ కింద గ్రావిటీ పారుదలకు అనుకూలంగా లేని మెట్టభూముల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ప్రెజరైజ్డ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు ఆలస్యం కావడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాకు చెందిన వినూత్న 'ఇఫానెట్' టెక్నాలజీని ఉపయోగించి, రూ. 111.74 కోట్ల వ్యయంతో 2022లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలలోని 21 గ్రామాలకు చెందిన 17,377 ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, పనులు ఇంకా

- మిగతా 8వ పేజీలో...


కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

గౌరవెల్లికి గోదారి వచ్చేనా?

- మెట్ట ప్రాంత రైతుల ఎదురుచూపు
- కాలువల కోసం భూ సేకరణ చేస్తున్న అధికారులు
- ఎప్పటికి పూర్తయ్యేనో..

అక్కన్నపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్ అడుగడుగునా అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య పనులు కొనసాగినా రైతాంగానికి మాత్రం ఇంకా సాగునీరు అందించలేకపోతోంది. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రాజెక్టు కాలువల పూర్తికి అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధిహామీ ద్వారా కాలువల జంగల్ కటింగ్‌ను పూర్తిచేశారు. మంత్రి చొరవతో ప్రాజెక్టు పూర్తికి నిధులు రూ.431 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామాలకు సాగునీరు సరఫరా చేసే కాలువల కోసం భూసేకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ, ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర కావొస్తుండగా, గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు వచ్చేనా అంటూ రైతులు చర్చించుకుంటున్నారు. పనులు పూర్తయ్యేది ఎన్నడో.. సాగునీరు అందిందే ఎప్పుడో అని అంటున్నారు.

95శాతం పనులు పూర్తి..

గౌరవెల్లి ప్రాజెక్టు 95శాతంపైగా పనులను పూర్తి చేసుకుని అధికారులు ట్రయల్ రన్ చేసి గోదావరి జలాలను ప్రాజెక్టులోకి వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. 2007లో 1.43 టీఎంసీతో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో అప్పటి సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ సామర్థ్యాన్ని 8.24 టీఎంసీలకు పెంచుతూ రీడిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. భూనిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర డిమాండ్లపై ముంపు బాధితులు దశలవారీగా ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎలాగైనా ప్రాజెక్టును పూర్తిచేయాలని సంకల్పంతో భూనిర్వాసితులు, ముంపు బాధితులతో చర్చలు జరిపి వారికి రావాల్సిన పరిహారాలను అందించింది. ఎన్నో అడ్డంకులు, ఆందోళనలు, లాఠీచార్జీలు, పోలీస్ కేసులు, అరెస్టులు, జైలు శిక్షలు అనుభవించిన ముంపు బాధితులు శాంతించడంతో దశాబ్దాలుగా నీళ్ల కోసం ఎదురుచూస్తున్న మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు నీళ్లు వస్తాయని రైతులు ఆశ పడగా ఎన్జీటీ ఆదేశాలతో పిడుగు పడింది. దీంతో అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా పనులు నిలిపివేసింది. దీంతో రైతులు నిరుత్సాహం చెంది ఇక ప్రాజెక్టు పనులు పూర్తయి సాగునీరు వస్తుందో లేదోననే ఆందోళనకు గురయ్యారు. అంతలోనే శాసనసభ ఎన్నికలు జరిగి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, కేబినెట్‌లో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్‌కు అవకాశం దక్కడంతో ఆయన గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్జీటీలో కేసు ఉండడంతో మూడు అడుగులు వెనక్కి.. ఆరు అడుగులు ముందుకు అన్నట్లు కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం చేసుకుంటున్నారు.



గౌరవెల్లి ప్రాజెక్టు

పోలీసులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యం ఉండాలి

కంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న సమాజానికి అనుకూలంగా పోలీసులకు ఆధునిక సాంకేతికపై నైపుణ్యం ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శనివారం కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల మెయింటెనెన్స్‌ను పరిశీలించి, మాట్లాడారు. పెండింగ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇన్వెస్టిగేషన్‌లో ఎలాంటి సందేహాలున్న ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎస్‌హెచ్‌వోకు సూచించారు. ఈ తనిఖీలో ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.



ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

టేక్మాల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. శనివారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించి, మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

బొమ్మారెడ్డిగూడెం ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

పుల్‌కల్, జూలై 26 ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ షోకాజ్ నోటీస్‌లు జారీచేశారు. శనివారం ఆమె పాఠశాల సందర్శించారు. ఉదయం ప్రార్థనా సమయంలోగా పాఠశాలకు చేరుకోవాల్సిన ఉపాధ్యాయులు పుష్పలత, అనురాధ, జ్యోతి ఆలస్యంగా విధులకు హాజరవడంతో ముగ్గురికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. ప్రార్థనా సమయంలో ముగిశాక విధులకు హాజరవ్వడమేంటని సదరు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రార్థనా సమయానికంటే ముందుగానే విధులకు హాజరుకావాలన్నారు.



బొమ్మారెడ్డిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

రెండురోజుల మగశిశువు మృతదేహం లభ్యం

- వివరాల సేకరణలో పోలీసులు

జహీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శనివారం రెండురోజుల మగశిశువు మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ఆవరణలో గల ఓ హోటల్ వద్ద చిన్నారి మృతదేహాన్ని వదిలేసి పోయారు. స్థానికుల సమాచారం మేరకు ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. సీసీ కెమెరాలు, మృతిచెందిన శిశువు కాలికికట్టిన చీటీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. శిశువు ఆస్పత్రిలోనే మృతిచెందాడా లేక ఎక్కడైనా చనిపోయాడా..? పడేయడానికి గల కారణాలు ఏంటనే దానిపై ఆరాతీస్తున్నారు. ఈ నెల 25న మగశిశువు జన్మించినట్లు కాలికి కట్టిన చీటీ ఆధారంగా తెలుస్తుందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు. ఆస్పత్రి ఆవరణలో మగశిశువు మృతదేహం లభించడం పట్టణంలో కలకలం రేపింది.



శిశువు మృతదేహం

ఎండు గంజాయి, గోవా మద్యం పట్టివేత



పోలీసుల అదుపులో గంజాయి సరఫరా చేస్తున్న నిందితులు

మునిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ వైపు సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ మెదక్ డిప్యూటీ కమిషనర్ హరిక్రిష్ణ ఆదేశాల మేరకు శనివారం మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్ సీఐలు శంకర్, చంద్రశేఖర్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఓ ఆటోపై అనుమానం వచ్చి విచారించగా అందులో 501 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొయినాబాద్, లంగర్‌హౌస్‌కు చెందిన కంచె రాకేష్, నాంపల్లి శుభం, ధర్మరాజు, సాయికుమార్, పోరంపల్లి శ్రీకాంత్ అక్రమంగా బీదర్‌లో ఎండు గంజాయిని కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. పట్టుబడిన గంజాయితో పాటు ఆటో, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే గోవా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుండగా వివిధ బ్రాండ్లకు సంబంధించిన 3.30 లీటర్స్ సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్ ఎస్ఐలు హనుమంత్, అనుదీప్, అనిల్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులోని నిందితులకు రిమాండ్

మునిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు పోలీసుశాఖ గట్టి నిఘా పెట్టిందన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ బక్కన్న, కానిస్టేబుల్ హనీఫ్, పాండు, డ్రైవర్ సునీల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జిన్నారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 18 గడ్డపోతారం మున్సిపాలిటీ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శివరాముడు(39) ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించగా.. శనివారం మృతిచెందాడని చెప్పారు. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరూ మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందినవారని సీఐ చెప్పారు. మృతుడి కుమారుడు అగ్నేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

యువకుడు అదృశ్యం



శ్రీచక్రారెడ్డి

పటాన్‌చెరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్వ్యూకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. హైదరాబాద్ మీర్‌పేటకు చెందిన శ్రీచక్రారెడ్డి అనే యువకుడు బీటెక్ పూర్తిచేశాడు. ఈనెల 21న పటాన్‌చెరులో ఓ కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

- ఆరు తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

హత్నూర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ శుక్రవారం ఉదయం కుటుంబీకులతో కలిసి నర్సాపూర్ సమీపంలోని చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తలుపులు తెరిచి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆరు తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన శేరి ఆంజనేయులు కుటుంబంతో కలిసి శుక్రవారం ఉదయం బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టడంతో పాటు బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, క్లూస్ టీం సిబ్బంది ఆ రెండు ఇళ్లలో క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

పాఠశాల వాటర్‌ట్యాంకులో చనిపోయిన కోతి

- విషయం తెలిసి తీసి శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా నర్సాపూర్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వాటర్ ట్యాంకులో చనిపోయిన కోతి మృతదేహం స్థానికంగా కలకలం రేపింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వాటర్‌ట్యాంకుకు మూత లేక తెరిచి ఉండటంతో కోతి అందులో పడి చనిపోయినట్టు సమాచారం. అది ఎవరు గమనించకపోవడంతో ఎన్ని రోజులుగా అందులో ఉందో ఎవరికీ తెలియని పరిస్థితి. అయితే శనివారం ట్యాంకులో చనిపోయిన కోతి ఉన్న విషయం గుర్తించి దానిని స్థానిక వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో విషయం వెలుగుచూసింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది వెంటనే వెళ్లి ట్యాంకులో చనిపోయిన కోతిని తీసి ట్యాంకును శుభ్రం చేశారు.

సిగాచి ఆస్తులు జప్తు చేయాలి



కర్మాగారాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బాధిత కార్మికులకు పరిహారం చెల్లింపు విషయంలో జాప్యం చేస్తున్న సిగాచి కంపెనీ ఆస్తులు జప్తు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, పాండురంగారెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలోని కర్మాగారాలశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేసి మాట్లాడారు. పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి 25 రోజులు గడుస్తుందన్నారు. ఒకే విడతలో రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పి. నేటికీ చెల్లింపులు జరగలేదని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా ప్రకటన చేసినా అమలు కాలేదని వివరించారు. క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఇస్తామన్నారు నేటికీ ఎటువంటి చెల్లింపులు జరగడం లేదని వివరించారు. ఆచూకీ తెలియని ఎనిమిది మంది కుటుంబాలకు రూ.15 లక్షలు చెల్లించారని వివరించారు. కంపెనీల్లో భద్రత పట్ల అధికారులు పూర్తిస్థాయి నిర్లక్ష్యంతో వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటియు నాయకులు సత్తిబాబు, వీరారావు, మధుకర్‌రెడ్డి, రామకృష్ణ, గంగాధర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై 'కాంగ్రెస్' గోబెల్స్ ప్రచారం

- బీసీలకు బీజేపీ ఏం చేసిందో చెబుతా
- కాంగ్రెస్ ఏం చేసిందో చెబుతారా?
- పీసీసీ చీఫ్, ప్రభుత్వ విప్‌లకు ఎంపీ రఘునందన్‌రావు సవాల్



సంగారెడ్డిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై మూడురోజులుగా 'కాంగ్రెస్' పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దుయ్యబట్టారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్న దశాబ్దాలలో బీసీలకు బీజేపీ ఏం చేసిందో నేను చెబుతానని, మరి కాంగ్రెస్ ఏం చేసిందో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆయన సవాల్ విసిరారు. బీసీలకు ఏం చేశామో గణాంకాలతో ఎక్కడికి రమ్మంటే అక్కడికి చర్చకు వస్తానని మీరు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రి వర్గాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని, 56 శాతం బీసీలు ఉంటే ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం కరక్టేనా అని విప్ ఆది శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 250 మందిని కాంగ్రెస్ సీఎంలను చేస్తే అందులో 43 మంది ఓబీసీలే ఉన్నారన్నారు. బీజేపీ 68 మంది సీఎంలను చేస్తే అందులో 21 మంది ఓబీసీలు ఉన్నారన్నారు. 31 శాతం ఓబీసీలను బీజేపీ సీఎంలుగా చేసిందని, 17 శాతం మందిని మాత్రమే కాంగ్రెస్ సీఎం చేసిందని వివరించారు. ఎన్‌డీఏ కూటమిలో 20 మంది సీఎంలు ఉంటే ఐదుగురు ఓబీసీ, ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు మైనార్టీలు సీఎంలుగా ఉన్నారన్నారు. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కేవలం ఇద్దరు ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని, మోదీ క్యాబినెట్‌లో 21 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారన్నారు. దేశానికి రాష్ట్రపతిగా దళితులను, గిరిజనులను చేసిన ఘనత బీజేపీదే అన్నారు. తెలంగాణకి రెండు కేంద్ర మంత్రి పదవులు ఇస్తే ఒక బీసీకి మంత్రి పదవి బీజేపీ ఇచ్చిందన్నారు. కేటీఆర్, ఎంపీ సీఎం రమేశ్ ఎపిసోడ్‌పై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో బీజేపీ ఎంపీలపై కేటీఆర్ బట్టకాల్చి మీద వేశారన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తనపై కేటీఆర్ మొదట ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర నాయకులు సంగప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.



మ్యూజియంలో రెండో ప్రదర్శనను మూసి ఉంచిన గది



పురావస్తు వస్తువుల చూపే ప్రదర్శన ఖాళీ బ్లాకు

సండే స్పెషల్ Sunday Special

ఈ చరిత్ర ఏ సిరాతో..!

- చెదలు పట్టిస్తున్నారు..
- 85 ఏళ్ల క్రితం మ్యూజియం ఏర్పాటు
- మరమ్మతుల పేరిట మూసివేత
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో విలువైన సంపద
- ఏడాదిగా పట్టించుకునేవారు కరువు
- అసలున్నాయో.. లేవో.. పట్టని పురావస్తుశాఖ

కొండాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాకు చరిత్రలో ఓ పేజీ ఉంది. మెతకుసీమగా పేరున్న ఈ జిల్లాలో శాతవాహనుల కాలం నాటి చిహ్నాలున్నాయి. గౌతమిపుత్ర శాతకర్ణి, వశిష్ట పుత్ర పులుమావి, శివశ్రీ, యజ్ఞశ్రీ శాతకర్ణిల కాలం నాటి విలువైన వస్తువులు లభించాయి. అలాగే, ఆది మానవుడి కాలం నాటి పనిముట్లు, బౌద్ధ చైత్యాలు, విహారాలు, స్థూపాలు, మఠాలు ఉమ్మడి జిల్లా సిగలో ఒకప్పటి నగలు. ఇంతటి విలువైన వస్తువులన్నింటినీ ఒకచోట చేర్చి వాటిని పరిరక్షించేందుకు నిజాంల కాలంలోనే ఇక్కడ మ్యూజియం నిర్మించి పహారా కూడా ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పుడవి సురక్షితంగా ఉన్నాయో.. అసలు ఉంటే ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయో కూడా తెలియడం లేదు. కారణం మరమ్మతుల పేరుతో జిల్లాలోని కొండాపూర్ మ్యూజియాన్ని ఏడాది క్రితం మూసివేశారు. అప్పటి నుంచి అటువైపు ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. నలుగురు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసిన అధికారులు.. కనీసం మరమ్మతు పనులు చేపట్టారా అంటే అదీ లేదు.

85 ఏళ్ల క్రితం తవ్వకాలు

1040-41లో బ్రిటీష్ పురావస్తు పరిశోధకుడు హెన్రీ కౌసెన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో తవ్వకాలు జరపగా, విలువైన చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతాన్ని శాతవాహనులు కౌండిన్యపురం(నేటి కొండాపూర్)ను కేంద్రంగా చేసుకుని రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జరిపినట్లు చరిత్ర చెబుతోంది. నాటి తవ్వకాల్లో ఆదిమానవుడి పనిముట్లు, దేవతామూర్తులు విగ్రహాలు లభించాయి. అలాగే, 1970 నుంచి 74 వరకు, 2009 నుంచి 2011 వరకు ఈ ప్రాంతంలో పురావస్తు తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి విలువైన వస్తువులు, బౌద్ధ మత ఆనవాళ్లు, రాతియుగం నాటి బంగారు, వెండి నాణెలు దొరికాయి.

నిజాం కాలంలోనే మ్యూజియం

ఈ ప్రాంతంలోని లభించిన వస్తువులను భద్రపరిచేందుకు నిజాం కాలంలోనే మ్యూజియం ఏర్పాటు చేశారు. చరిత్రను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పక్కా భవనం నిర్మించి, అప్పట్లోనే పహారా ఏర్పాటు చేశారు. నిజాం కాలంలో రెండుసార్లు, భారత ప్రభుత్వం హయాంలో మూడుసార్లు జరిపిన తవ్వకాల్లో బయటపడ్డ వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. ప్రజల సందర్శనార్థం ఏర్పాట్లు చేశారు. దీంతో ఈ ప్రాంతం పర్యాటక ప్రదేశంగా మారింది.

చెదలు పట్టిస్తున్నారు..

కొండాపూర్ మ్యూజియం ఉన్న భవనం వర్షం వస్తే ఉరుస్తుందని మరమ్మతుల పేరిట మూసేశారు. మ్యూజియంలోని రెండు బ్లాక్‌లను ఖాళీగా ఉంచి, ఓ గదిలో వస్తువులను పక్కన పెట్టారు. ఏడాది క్రితం వరకు ఈ మ్యూజియం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, ఏడాదిగా ఇన్‌చార్జిలతో ప్రైవేట్ సెక్యూరిటీని పెట్టారు. సందర్శకులనూ అనుమతించకపోవడంతో ఒకప్పుడు వివిధ ప్రాంతాల వారితో కళకళలాడిన ఈ మ్యూజియం ఇప్పుడు చిన్నబోయింది. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండటంతో అటువైపు వెళ్లే వారే లేకుండా పోయారు. దీంతో మ్యూజియంలోని విలువైన వస్తువులు ఉన్నాయో.. ఉంటే ఎలా ఉన్నాయో తెలియడం లేదు.



నిజాం ప్రభుత్వం 1940లో వస్తువుల ప్రదర్శనకు నిర్మాణాలు చేపట్టి పహారాతో సెక్యూరిటీ(ఫైల్)



సందర్శకులు లోపలి రాకుండా మెయిన్ గేటుకు తాళం వేసిన దృశ్యం

వస్తువులకు భద్రత ఎక్కడ



పురావస్తు తవ్వకాల్లో దొరికిన విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోయింది. నిజాం కాలంలో, భారత ప్రభుత్వ హయాంలో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ వస్తువులను పదిలపర్చాల్సి ఉండగా, ఏడాదిగా పట్టించుకోవడం లేదు. ఈ మ్యూజియంను ప్రైవేట్ సెక్యూరిటీకి వదిలేశారు.

- నర్సింలు, మాజీ సర్పంచ్, హరిదాస్‌పూర్



తాడూరుకు బదులుగా తాండూరుగా ఉన్న బోర్డు

హవ్వా.. ఇవేం పేర్లు..!

- జాతీయ రహదారి వెంట తప్పుల తడకగా నేమ్‌బోర్డులు
- గ్రామాల పేర్లు మార్చేయడం పట్ల స్థానికుల విస్మయం

చేర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట-సిరిసిల్ల 365బీ జాతీయ రహదారిలో కొన్నాళ్ల క్రితం చేపట్టిన జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తికావచ్చాయి. ఈ నేపథ్యంలో జనగామ నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు దారి పొడవునా గల ఆయా గ్రామాల పేర్లతో నేమ్ ప్లేట్లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ అసలు పేర్లకు సరిపోలక ఇంగ్లిస్, తెలుగు మాధ్యమంలో అక్షర దోషాలుండటంతో అర్థాలు మారిపోతున్నాయి. చేర్యాల పట్టణం నుంచి చుంచనకోట, నర్సాయపల్లి గ్రామాలకు వెళ్లేదారిలో చుంచంకోట, నర్సయ్యపల్లి అని, తాడూరు క్రాస్ రోడ్డు తాడూరుకు బదులు తాండూరు, మద్రిముస్త్యాలకు బదులు మద్రిముస్తియల అన్న బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ప్రయాణించేవారు అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు నిద్ర మత్తువీడి నేమ్‌బోర్డులను సవరించి ఆయా గ్రామాల ప్రాశస్త్యాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.



చుంచనకోటకు బదులు చుంచుంకోటగా ఉన్న బోర్డు

అర్హులందరికీ రేషన్‌కార్డులు : మెదక్ కలెక్టర్

తూప్రాన్/ మనోహరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డితో కలిసి శనివారం ఆయన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9,900 కుటుంబాలకు కొత్తగా రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. రేషన్‌షాపుల్లో నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నారని, తాను పలు చోట్ల భోజనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాచారం ఆలయ చైర్మన్ పల్లెర రవీందర్ గుప్తా, ఆర్డీవో జయచంద్రారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎస్‌వో నిత్యానంద, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. నానో యూరియా, నానో డీఏపీ వాడాలని అవగాహన కల్పిస్తున్న రైతు ఆగ్రోస్ సేవా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి కలెక్టర్‌కు వివరించారు.

మనోహరాబాద్ మండలంలోని రైతు వేదికలో సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఆయన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్, ప్యాక్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



మనోహరాబాద్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బురద రోడ్డులో ఎలా నడిచేది..?

శివ్వంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో బురద రోడ్డులో నడవలేక ఇబ్బంది పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గిరిజనులు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన నవాబ్‌పేట్ రాములుతండాలో శనివారం చోటుచేసుకుంది. మండల పరిధి నవాబ్‌పేట పంచాయతీ పరిధిలోని రాములుతండాకు నవాబ్‌పేట్ గ్రామం నుంచి ఉన్న ప్రధాన రోడ్డు రెండు కిలోమీటర్ల మేర బురదమయంగా మారింది. దీంతో వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో గిరిజనులు శనివారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెండు, మూడేళ్లుగా రోడ్డు విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



శివ్వంపేట మండలం రాములుతండాలో బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- వ్యవసాయ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్

కంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి కంది పీఏసీఎస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పీఏసీఎస్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, నానో యూరియా, విత్తనాలు స్టాక్‌పై ఆరా తీశారు. రికార్డులు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవో శ్రీనివాస్, సీఈఓ మందాడ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో నాగుపాము కలకలం

శివ్వంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్‌లోని నాగుపాము రాగా చిన్నారులు భయాందోళన చెందారు. టీచర్ అప్రమత్తతతో చిన్నారులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన మండలంలోని పిల్లుట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగింది. టీచర్ విజయలక్ష్మి కథనం ప్రకారం.. పిల్లుట్ల అంగన్‌వాడీసెంటర్‌లో శనివారం నాగుపాము వచ్చింది. పిల్లలంతా దానిని చూసి భయపడిపోయారు. ఆ సమయంలో టీచర్ విద్యార్థులందరినీ బయటకు తీసుకువచ్చారు. గ్రామ కార్యదర్శి నాగేష్‌కు ఫోన్ చేయగా, ఆయన పారిశుధ్య కార్మికులను పంపించారు. వారు వచ్చి పామును చంపివేశారు.



పిల్లుట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో చంపేసిన నాగుపాము

శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి అవార్డు

మెదక్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్, మాగ్నిస్ డయాగ్నొస్టిక్ సంస్థల పక్షాన ఉచిత ఆరోగ్య శిబిరాల్లో ముందు వరుసలో నిలిచిన మెదక్ మండలం రాయిన్‌పల్లి ప్రాంతానికి సింగం శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. శనివారం నగరంలోనీ ఓ కన్వెన్షన్‌హాల్లో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. శ్రీనివాస్‌రావు కొన్నాళ్లుగా పేద రోగులకు హెల్త్ క్యాంపుల ద్వారా సేవలందిస్తున్నాడు. ఆ సేవలను గుర్తించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది.



హైకోర్టు న్యాయమూర్తి నుంచి అవార్డు అందుకుంటున్న సింగం శ్రీనివాసరావు

సమస్యల సంద్రంలో.. దుబ్బాక రామసముద్రం

- అసంపూర్తి పనులతో ఆగమైన చెరువు
- చెరువంతా గుర్రపుడెక్క తూటిచెట్లు
- పట్టించుకోని అధికారులు

దుబ్బాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యమో.. కాంట్రాక్టర్ అలసత్వమో కానీ దుబ్బాక మండలంలోని రామసముద్రం సుందరీకరణకు నోచుకోవడం లేదు. 2016లో చెరువు సుందరీకరణకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.5 కోట్లను మంజూరు చేశారు. అంతేకాక మున్సిపల్‌శాఖ నుంచి సుమారు రూ.50 లక్షలతో పిల్లల పార్కు, మరో రూ.60 లక్షలతో జిమ్‌ను ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై రేలింగ్‌వాల్, పారాపిట్‌వాల్, బతుకమ్మ ఘాట్, బ్రిడ్జి, కాలువ, గ్రీనరీ తదితర పనులకు రూ.4.80 కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా ఇరిగేషన్‌శాఖ పూర్తిచేసింది. మరుగుదొడ్ల నిర్మాణం, చిల్డ్రన్‌పార్క్, జిమ్‌ను మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధుల ద్వారా చేపట్టింది. అయితే ఇంకా రూ.60 లక్షల వరకు పనులు చేపట్టాల్సి ఉన్నది. అదేవిధంగా మొత్తం సుందరీకరణకు ఇంకా రూ.2 కోట్లు అవసరం ఉన్నాయి. అయితే కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.40 లక్షల బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో రామసముద్రం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

చెరువంతా గుర్రపుడెక్క

ప్రభుత్వం బిల్లులు, నిధులు విడుదల చేయడంతో చెరువు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. అలాగే తుమ్మచెట్లు కూడా మొలిచాయి. రెండేళ్ల క్రితం గుర్రపు డెక్కను, తుమ్మచెట్లను తామే తొలగించామని మత్స్యకారులు చెబుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన దుబ్బాక రామసముద్రం చెరువు

మూలనపడిన చిల్డ్రన్ పార్క్

చెరువు కట్టపై రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జారుగు బండ, ఊయ్యాలలు, గుర్రపు స్వారీ కుర్చీలు, తదితర ఆట వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే ఎవరూ పట్టించుకోకపోవడంతో పార్కు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. అక్కడికి వెళ్లాలంటేనే చిన్నారులు జంకుతున్నారు.

చెడిపోయిన బోటింగ్

పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో రామసముద్రం చెరువులో ఏడేళ్ల క్రితం పర్యాటకశాఖ పడవలను తెచ్చింది. ఇందుకు స్థానికంగా ఇద్దరు మత్స్యకారులకు శిక్షణ కూడా ఇచ్చి.. తాత్కాలికంగా నియమించారు. కానీ వారికి పర్యాటక శాఖ వేతనాలు అందించలేదు. దీంతో బోటింగ్ కోసం తెచ్చిన పడవలు మూలనపడి చెడిపోయాయి.

వాకర్స్‌కు ఉపయోగపడని జిమ్

చెరువు కట్టపై వాకర్స్ నడిచే ప్రాంతంలో టైల్స్ పూర్తిగా వేయకపోవడంతో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్ నిరుపయోగంగా ఉన్నది. వాకర్స్ నడిచే దారివెంట మొక్కలు మొలిచాయి. తరచూ పాములు కనిపిస్తుండడంతో వాకర్స్ భయపడుతున్నారు. అలాగే రూ.10 లక్షలతో సుమారు కిలోమీటరు చుట్టూ ఉండే చెరువుకు రెయిలింగ్ వేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో దొంగలు కట్ చేసుకుని వెళ్లిపోతున్నారు.



నిర్వహణ లేక మూలనపడిన అల్ట్రా మోడ్రన్ మరుగుదొడ్లు

నిరుపయోగంగా టాయిలెట్లు

పర్యాటకుల సౌకర్యార్థం 2020లో రూ.10 లక్షలతో చెరువుపై అల్ట్రా మోడ్రన్ మరుగుదొడ్లు నిర్మించారు. వీటి నిర్వహణ సరిగ్గా లేక చుట్టూ చెట్లు, పొదలు పెరిగాయి. కనీసం నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రామసముద్రం కాలుష్య కాసారంగా మారింది. దుబ్బాకలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉండటంతో రంగులు అద్దే నైట్రేట్, రసాయనాలు చెరువులోకి చేరుతున్నాయి. దశాబ్దకాలం నుంచి రామసముద్రం చెరువు సుందరీకరణ పనులు నత్తనడకన సాగడం పలు విమర్శలకు తావిస్తుంది.

గజ్వేల్‌లో ఐదు ఇళ్లలో చోరీ

- బంగారం, వెండి వస్తువులు మాయం
- క్లూస్ టీంతో విచారణ చేపట్టిన పోలీసులు

గజ్వేల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఏకంగా ఐదు ఇళ్లలో చొరబడి బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇళ్లలోని వస్తువులను చిందరవందరగా పడేసి, బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. పట్టణంలోని ధనలక్ష్మి కాలనీకి చెందిన పసునూరి నవనీత్ భర్త అనారోగ్యానికి గురవగా, 15 రోజులుగా హైదరాబాద్‌లోని కుమారుడి ఇంట్లో ఉంటూ అక్కడే చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి నవనీత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే గజ్వేల్‌కు చేరుకున్న వారు ఇంట్లోని 15 గ్రాముల బంగారం అపహరించుకుపోయినట్లు గుర్తించారు. వాసవీనగర్‌కు చెందిన హనీఫ్ రామాయంపేటలో వ్యవసాయ పనుల నిమిత్తం పది రోజుల క్రితం వారి ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం తలుపులు తెరచి ఉండటంతో ఎదురుగా ఉండే వారి బంధువులు గమనించి హనీఫ్‌కు సమాచారం అందించారు. వెంటనే గజ్వేల్‌కు చేరుకుని ఇంటిని పరిశీలించి రూ.10 వేల విలువైన వెండి వస్తువులను ఎత్తుకు వెళ్లినట్లు గుర్తించారు. మహ్మద్‌షాదుల్లా తన కింద అంతస్తులో తాళం వేసి పైన అంతస్తులో నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా, తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించి, లోనికి వెళ్లి చూశారు. రూ.15 వేల నగదు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. మరో రెండు ఇళ్లలో సైతం దుండగులు చొరబడినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు క్లూస్ టీంతో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.



గజ్వేల్‌లో ఓ ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

-కలెక్టర్ హైమావతి



విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కొమురవెల్లి, జూలై26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి సమీపంలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ హైమావతి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. మెను ప్రకారం శనివారం క్యాప్సికం కర్రీ అందించాల్సి ఉన్న నిర్వాహకులు సొరకాయ కర్రీ విద్యార్థులకు వడ్డించారు. క్యాప్సికం కర్రీ ఎందుకు వండలేదు అని నిర్వాహకులను ప్రశ్నించగా కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్ క్యాప్సికం సప్లై చేయకపోవడంతో వండలేదని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. మెనును తప్పకుండా పాటించాలని డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయురాలికి ఆదేశించారు. మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పేదల కష్టాలు తీరుస్తున్న ప్రభుత్వం

చేర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలు తీర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులకు అందించక పేదల జీవితాలతో చెలగాటమాడారని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో అర్హులందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసి సొంతింటి కల నేరవేర్చుతున్నామన్నారు. రేషన్‌కార్డులు అందించడం, సన్నబియ్యం పంపిణీ చేసి పేదల ఆకలి తీర్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు.

తలదించుకుని చదువుకుంటే తలెత్తుకుని బతుకుతారు

చేర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని క్రమశిక్షణతో మెదలుతూ తలదించుకుని చదవుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుని జీవితంలో తలెత్తుకుని జీవిస్తారని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. చేర్యాల మండలం చుంచనకోట జడ్పీఎస్ఎస్‌లో శనివారం మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి, మత్తుపదార్థాల వినియోగం అనర్థాలు తదతర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు తావివ్వకూడదని సూచించారు. సోషల్ మీడియాను అవసరం ఉంటే తప్ప వినియోగంచకూడదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆగని వాన

(5వ పేజీ తరువాయి)

పెద్దచెరువు పొంగిపొర్లుతున్నది.

కనిపించని వైద్యశాఖ అధికారులు..

వర్షపు నీరు నిల్వ ఉండటంతో లార్వా దోమలు అభివృద్ధి చెందకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాల్సిన వైద్యశాఖ అధికారులు ఇటు కన్నెత్తి కూడా చూడటం లేదు. నీరు నిల్వ ఉన్న చోట అయిల్ బాల్ వేయడం వంటి చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పత్తాలేరు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులకు సూచించినా వారు బేఖాతరు చేస్తున్రాఉ. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదిలోనే వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

వర్షపాతం ఇలా..

తొగుటలో 48.5 మి.మీ, కొమురవెల్లి 43.3 మి.మీ, కొహెడ 43.0 మి.మీ, చేర్యాలలో 37.3 మి.మీ, నారాయణరావుపేటలో 36.0 మి.మీ, అక్కన్నపేటలో 35.0 మి.మీ, దౌల్తాబాద్‌లో 34.8 మి.మీ, కొండపాకలో 32.5 మి.మీ, సిద్దిపేట రూరల్‌లో, అక్బర్‌పేట-భూంపల్లిలో 31.8 మి.మీ, మద్దూర్‌లో 30.8 మి.మీ, సిద్దిపేట అర్బన్ మండలంలో 29.3 మి.మీ, దుబ్బాక, హుస్నాబాద్‌లో 28.8 మి.మీ, మర్కూక్ 28.5 మి.మీ, మిరుదొడ్డిలో 27.5 మి.మీ, దూళిమిట్టలో 27.3 మి.మీ, జగదేవ్‌పూర్‌లో 25.3 మి.మీ, బెజ్జంకిలో 24.8 మి.మీ, నంగునూర్‌లో 24.3 మి.మీ, రాయపోల్‌లో 24.0 మి.మీ, ములుగులో 21.3 మి.మీ, కుకునూర్‌పల్లి, గజ్వేల్‌లో 20.5 మి.మీ, వర్గల్‌లో 13.3 మి.మీ వర్షపాతం నమోదైంది.



పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

గ్రామాలను పట్టించుకోరా?

● కుంగిన మురికి కాలువ స్లాబ్ ● చేతులు దులుపుకుంటున్న కార్యదర్శులు ● పట్టించుకోని అధికారులు



నంగునూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పట్టించుకునేవారు లేకపోవడంతో పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది. గతంలో గ్రామ పంచాయతీకి సంబంధించి సమస్య ఏదైనా ఉంటే స్థానిక సర్పంచ్‌కు చెప్పుకునేవారు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా చుట్టం చూపులా వచ్చిపోతున్నారు. ప్రత్యేక అధికారులకు సమస్యలు చెప్పుకోలేక గ్రామీణ ప్రజలు సతమతమవుతున్నారు. రికార్డులో మాత్రం గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు వేశారే గాని ఎన్నడూ కూడా వచ్చి గ్రామ సమస్యలపై పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతా పంచాయతీ కార్యదర్శులు తీసుకొని అప్పులు చేస్తూ అర కొర పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి నంగునూరు గ్రామంలోని బీసీ కాలనీలో మురికి కాలువ పై స్లాబ్ పగిలిపోయి చాలా రోజులు అవుతున్న పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడం వల్లే పనులు చేపట్టడం లేదని సమాచారం. మండల కేంద్రంలో గ్రామపంచాయతీలోని బీసీ కాలనీలో పరిస్థితి అధ్వానంగా మారింది. మురికి కాలువపై వేసిన కాంక్రీట్ స్లాబ్ కూలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. సైడ్ మోరీలపై వేసిన కాంక్రీట్ స్లాబ్స్ కూలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురికి కాలువపై వేసిన కాంక్రీట్ స్లాబ్స్ మధ్యలో హోల్స్ పడటం, స్లాబ్ చివరల్లో ఇనుప చువ్వలు బయటకు రావడంతో అందులో వాహనాలు ఇరుక్కు పోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇక్కడ ప్రయాణీకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారని తెలిపారు. అలాగే బీసీ కాలనీలోకి ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు వంటి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. అలాగే ఉంద్రాయి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురికి కాల్వ పై కప్పు పగిలిపోవడంతో ఆ దారి వెంట వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ప్రత్యేక అధికారులు పట్టించుకుని సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నంగునూరు బీసీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మురికి కాలువ

రైతులు అధైర్య పడవద్దు

మిరుదొడ్డి,జూలై26(ఆంధ్రజ్యోతి):రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధైర్యపడవద్దని మిరుదొడ్డి మండల వ్యవసాయాధికారి మల్లేశం అన్నారు. శనివారం మిరుదొడ్డిలో ఫర్టిలైజర్ దుకాణాలను, పీఏసీఎస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మిరుదొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 20మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్‌కు 20టన్నుల మెట్రిక్ టన్నులయూరియా వచ్చిందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులు యూరియాను తగ్గించి, నానో యూరియాను వాడుకోవాలని సూచించారు

ఆరోగ్యసమాజమే.. అభివృద్ధికి నాంది

దుబ్బాక, జూలై26 (ఆంధ్రజ్యోతి): సమాజం ఆరోగ్యకరంగా ఉంటేనే అభివృద్ధి సాధిస్తుందని, మనిషి ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ ఉండదని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాకలోని ఆర్యవైశ్యభవనంలో అఖిలరాజ్‌ఫౌండేషన్, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మోగా హెల్త్‌క్యాంపును నిర్వహించారు. ఆసంస్థ వ్యవస్థాపకుడు తౌడసత్యనారాయణ, మేడ్చెల్ డీఎస్‌పీ మధుకర్‌స్వామితో కలిసి సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి మోగా హెల్త్‌క్యాంపును ప్రారంభించారు. సుమారు 3వేల మంది రోగులకు వివిధ రకాల చికిత్సలను నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నుంచి సుమారు 14 విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. అఖిలరాజ్‌ఫౌండేషన్, మేడ్చెల్ డీఎస్‌పీ మధుకర్‌స్వామికి ఈప్రాంతంతో ఉన్న సంబంధంతో ఇక్కడి ప్రజలకు సేవాకార్యక్రమం చేయడం సంతోషకరమన్నారు. ఇక్కడి ప్రజలతో ఉన్న అవినాభావ సంబందంతోనే మధుకర్ స్వామి, ఎస్ఐ సత్యనారాయణలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే ఆప్రాంతం, ఆకుటుంబం, ఆగ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన కరోనా మహమ్మారి మూలంగా సమాజం మొత్తం చిన్నాభిన్నం అయ్యిందనేది ఆయన గుర్తు చేశారు. భారతదేశం బలమైనదేశంగా నిలబడటం మూలంగా వెంటనే కోలుకుందనీ, కొన్ని దేశాలు ఇంకా ఆర్థికంగా పుంజుకోలేకపోతున్నాయన్నారు. అన్ని సంపదలకంటే ఆరోగ్యసంపదనే సమాజానికి మంచిదన్నారు.



మోగాహెల్త్ క్యాంపును సందర్శించిన సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, మేడ్చల్ డీఎస్పీ మధుకర్‌స్వామి, దుబ్బాక సీఐ శ్రీనివాస్

పత్తిచేలల్లో కాలువలు

● చేర్యాల ఏడీఏ రాధిక

చేర్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో పత్తి చేలలో నీరు నిల్వఉండకుండా కాలువలు ఏర్పాటుచేసి బయటకు పంపించాలని చేర్యాల ఏడీఏ రాధిక అన్నారు. చేర్యాల మండలకేంద్రం శివారులో పలువురు రైతుల పత్తిచేలు పరిశీలించి పలు సూచనలు చేశారు. భూస్వభావాన్ని బట్టి తేలిక, మధ్యస్తభూములలో ఈనెల 30వతేదీ వరకు అచ్చువేసుకుని మొక్కల సంఖ్యను పెంచుకునేలా విత్తుకుంటే దిగుబడి తగ్గదన్నారు. విత్తిన పదిరోజులలో మొలక రానియెడల మళ్లీ విత్తాలని, 45-60రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలని సూచించారు. భాస్వరం ఎరువు మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15రోజులలో వేసుకోవాలని, ఎకరారికి 100కిలోల యూరియా, 150కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వినియోగించాలని సూచించారు. అధిక వర్షాలకు గురైనపుడు పత్తి పెరుగుదలకు 19.19.19 లేదా 13:40:45లాంటి పోషకాలను లీటరు నీటికి 10గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆమె వెంట చేర్యాల ఏవో బోగేశ్వర్ ఉన్నారు.

టాస్, ఉల్లాస్‌పై గ్రామస్థులకు అవగాహన

మద్దూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాల మూలంగా మధ్యలో చదువు మానేసిన వారితో పాటు పదవ తరగతి పాసై పై చదువులు చదువుకోవాలనే వారికి టాస్, ఉల్లాస్ ద్వారా ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఎంఈవో వరదరాజు తెలిపారు. శనివారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాధవ్ అధ్యక్షతన గ్రామస్థులకు టాస్, ఉల్లాస్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ తరగతి ఉత్తీర్ణులు కాని వారితో పాటు మధ్యలో చదువు మానివేసిన వారికి ఓపెన్ టెన్త్ పరీక్షలు వ్రాసుకోవడానికి మంచి అవకాశమన్నారు. అదే విధంగా 10వ తరగతి పాసై ఆ పై చదువులు చదువుకోలేని వారికి ఓపెన్ ఇంటర్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బాకి చంద్రబాను, ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి, ఉపాధిహామీ పీల్డు అసిస్టెంట్ ఐలయ్య, ఐకేపీ సీఏ జయమ్మ, సబిత, మాజీ సర్పంచ్ అంది భూపతి, స్కూల్ చైర్ పర్సన్ సరస్వతి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ ..



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఓదెలు

బెజ్జంకి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నబోయిన ఓదెలు అన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో శనివారం బెజ్జంకిలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలకు ఆయన హజరై మాట్లాడారు. మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు అత్యధికంగా గెలిచి ఎంపీపీ స్థానాన్ని కూడ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ పార్టీకి ప్రజలు అండగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత

మిరుదొడ్డి, జూలై26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభతరమైన పద్ధతిలో విద్యాభోదన చేయడానికి ప్రొజెక్టర్ ఎంతో ఉపయోగపడుతుందని బహుజనమిత్ర బృందం సభ్యులు యాదాగౌడ్, శ్రీనివాస్, లక్ష్మన్, మధులు అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బహుజన మిత్రబృందం సభ్యులు ప్రొజెక్టర్‌ను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకిషన్ తదితరులున్నారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి అనిల్ రావు, రాములు, రామచంద్రం, రాజు, సునీత, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందించిన సాయిబాబా టెంపుల్ ట్రస్ట్

చేర్యాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు ఎంపీపీఎస్‌కు చెందిన 150మంది విద్యార్థులకు హైదరాబాదు షిర్డిసాయిబాబాటెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.30వేలు విలువగల పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను విరాళంగా అందజేశారు.ఈసందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తౌట భూమయ్య చేతులమీదుగా విద్యార్థులకు ప్రధానం చేశారు.

బీజేపీతోనే గ్రామస్వరాజ్యం సాకారం

రాయపోల్/తొగుట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీజేపితోనే గ్రామస్వరాజ్యం సాకారమవుతుందని బీజేపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. శనివారం తొగుటలో మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల మండల కార్యశాల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గ్రామం స్వయం సమృద్ధి సాధిస్తేనే అసలైన గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని జాతి పిత మహాత్మాగాంధీ నమ్మారని తెలిపారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని బైరి శంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయపోల్‌లో జరిగిన బీజేపీ సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లోని అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయాలని, వారిని కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని సూచించారు.

మేకను తిన్నది రేసుకుక్కలు, చిరుత కాదు

దౌల్తాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లి, జంగపల్లి శివారు ఆటవీ ప్రాంతంలో మేకను తిన్నది చిరుత పులి కాదని, రేసు కుక్కలని ఆటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. చిరుత పులి ఒక మేకను తిన్నదని సమాచారం అందుకున్న ఆటవీ శాఖ అధికారులు మేకను తినింది చిరుతనా లేక రేసు కుక్కలా అని గుర్తించడానికి ఇంతకు ముందు చేగుంట మండలం బోనాల, ఇబ్రహింపూర్ ఆటవీలో ప్రాంతంలో మేకను రేసుక్కులు తిన్నాయి. దాని ఆధారంగా గాజులపల్లి,జంగపల్లి ఆటవీ ప్రాంతంలో మేకను తినేసింది చిరుత పులి కాదన్నారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే కేసులు

గజ్వేల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): డీలర్లు అధిక ధరలకు యూరియా అమ్మితే కేసులు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. డీలర్లు ప్రతి రైతుకు ఒకటి, రెండు బస్తాలు చొప్పున అందరి రైతులకు వచ్చేటట్లు ఇవ్వాలన్నారు.

సైకిళ్ల పంపిణీ

కోహెడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశామని జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం, మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ తెలిపారు. శనివారం కోహెడలో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో శనివారం జరిగిన సైకిల్ పంపిణీ కార్యక్రమంలో మండలంలోని మూడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు కేంద్రమంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కానుకగా ఉచితంగా పంపిణీ చేశారన్నారు. కోహెడ హైస్కూలుకు 61, శనిగరంకు 57, బస్వాపూర్ 44, శ్రీరాములపల్లి 22, చెంచెల్ చెర్వుపల్లికు 20, సముద్రాలకు 19, తంగాళ్లపల్లికి 17, గుండారెడ్డిపల్లి 15, వైెసంపల్లి 14, వరికోలు 14, రాంచంద్రపూర్‌కు 12, వింజపల్లి పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులకు అందించారన్నారు. 304 మంది విద్యార్థులకు సైకిళ్లను అందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వారు కృతజతలు తెలిపారు.

భారీ వర్షాలతో అప్రమత్తం

వర్గల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలిని, అత్యవసరమైతే తప్ప అనవసరంగా బయటకు రావొద్దని గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి సూచించారు.

ఇసుక డంపులు స్వాధీనం

కోహెడ/బెజ్జంకి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలించి నిల్వ చేసిన ఇసుక డంపులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వీరాపూర్, తోటపల్లి గ్రామాల శివారులో సుమారు 130 టన్నుల ఇసుకను డంపు చేశారన్న సమాచారంతో శనివారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు దాడులు నిర్వహించి ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను డంపు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

కోహెడలో

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను టాస్క్ ఫోర్స్ కోహెడ పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక నిల్వలను ఏర్పాటు చేశారన్న సమాచారంతో 10 ట్రిప్పుల ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తెలిపారు. నంగునూరు మండలం అక్కనపల్లి గ్రామానికి చెందిన మామిడి లక్ష్మణ్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక డంపు చేసినట్లు గుర్తించామని ఎస్సై అభిలాష్ తెలిపారు. ఇసుక నిల్వలపై విచారణ చేపట్టి బాధ్యుడిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

మద్దూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న మద్దూరు గ్రామానికి చెందిన విద్యార్థి తస్మియా మునిజను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో వరదరాజు ప్రత్యేకంగా విద్యార్థికి అభినందనలు తెలిపారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడుసర్వర్ మొహియుద్దీన్ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు షకీల్‌భాయ్, దామెర మల్లేశం, దాసు మహేందర్, జేబాతబస్సుం, బాకీ చంద్రభాను, చంద్రారెడ్డి అభినందించిన వారిలో ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



మహిళా కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

కొండపాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ లో జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అమరవీరుల త్యాగాల సాక్షిగా ఏర్పడ్డ జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ సామాజిక సేవలో ముందుకు సాగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు బొజ్జ మహదేవ్ అన్నారు. దుద్దెడ గ్రామంలోని జాగృతి భవనంలో జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ 26వ వార్షికోత్సవం నిర్వహించారు. అంతకుముందు కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. పాకిస్తాన్ తో యుద్ధంలో అసువులు బాసిన అమర సైనిక వీరులకు నివాళులు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. అనంతరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామంలో ఇటీవల కాలంలో పోలీసు ఉద్యోగం సాదించిన దయ్యాల శ్రావణి (ఏఆర్ కానిస్టేబుల్),ఆరెపల్లి సరిత (సిఐఎస్ఎఫ్)కానిస్టేబుల్‌లను వారి తల్లిదండ్రులతో కలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా నిరుపేద కుటుంబంలో పుట్టి పలువురికి ఆదర్శంగా నిలిచిన యువతులిద్దర్నీ అభినందించారు.

ఎన్నాళ్లీ సాగుదీత

(5వపేజీ తరువాయి)

పూర్తికాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల ఆలస్యంపై రైతుల ఆందోళన

మల్లన్నసాగర్ జలాశయం తలాపున్నే ఉన్నప్పటికీ తమ భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇటీవల ఆందోళనకు దిగారు. జూన్ 21న తొగుట మండలం గుడికందుల గ్రామంలో రైతులు సమావేశమై జలసాధన సమితిని ఏర్పాటు చేసుకున్నారు. ఇరిగేషన్ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పనులు ప్రారంభమయ్యే వరకు 21 గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా 10 శాతం పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆలస్యమవుతున్నాయని అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు, పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తాత్కాలికంగా తమ ఆందోళనను విరమించారు.



డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మెట్టభూములకు ప్రయోజనం ఇలా..

'ఇఫానెట్' టెక్నాలజీతో నీటి సరఫరా, నిర్వహణ, నియంత్రణ జరుగుతుంది. ఈ వ్యవస్థలో భాగంగా ఎల్లారెడ్డిపేట వద్ద నిర్మించిన మినీ పంప్‌హౌస్ వద్ద 2.13 మెగా వాట్ల సామర్థ్యం గల రెండు చిన్నపాటి మోటార్లను బిగించారు. పంపింగ్ చేసిన నీటిని ఐరన్, హెచ్‌డీపీయూ, డీఐ పైప్‌లైన్ల ద్వారా అధిక పీడనంతో సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భూసేకరణ లేకుండానే రైతుల సమ్మతితో వారి భూములలో నాలుగు అడుగుల లోతులో మూడు అంగుళాల పైప్‌లైన్లు వేసి, ఆటోమేటిక్ వాటర్ ఛాంబర్లకు అనుసంధానిస్తున్నారు.


ప్రతి 50 ఎకరాలకో ఓఎంసీ..

ప్రతి 50 ఎకరాలకో ఓఎంసీ ఛాంబర్ ద్వారా సౌరశక్తితో పనిచేసి నీటిని నియంత్రించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే, ప్రతి 12 ఎకరాలకు ఒకటిగా ఉన్న నాలుగు డిస్ట్రిబ్యూటరీ ఛాంబర్ల ద్వారా 5 ఎకరాలకు ఒక పైప్‌లైన్‌తో పాటు గేట్‌వాల్ అమర్చి రైతులకు సాగునీరు సరఫరా జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు మెయిన్ లైన్ పనులు 99 శాతం పూర్తవగా, 14 సబ్‌లైన్లు 74 శాతం, డిస్ట్రిబ్యూషన్ లైన్లు 31 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా సరఫరా చేసిన నీటిని రైతులు నేరుగా గాని, బిందు సేద్యంతోగాని తమ భూములలో పారించుకునేందుకు వీలుగా అనుసంధానిస్తున్నారు. ఈ విధానం ద్వారా 50 శాతం నీటి వృధాను అరికట్టవచ్చని మలన్న సాగర్ డీఈ శ్రీనివాస్‌రావు తెలిపారు.

21 గ్రామాలకు సాగునీరు

ఈ డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ల ద్వారా దుబ్బాక నియోజకవర్గంలో 11,607 ఎకరాలు, సిద్దిపేటలో 4,244 ఎకరాలు, గజ్వేల్ నియోజకవర్గంలో 1526 ఎకరాల మెట్ట భూముల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. తద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని బండారుపల్లి, ఘనపూర్, గుడికందుల, పెద్దమాసానపల్లి, ఎల్లారెడ్డిపేట, దుంపలపల్లి, హాసన్‌మీరాపూర్, పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్, మిరుదొడ్డి, ధర్మారం, కొండాపూర్, సిద్దిపేట నియోజకవర్గంలోని తడ్కపల్లి, వెంకటాపూర్, బుస్సాపూర్, ఇరుకోడ్, తోర్నాల, గజ్వేల్ నియోజకవర్గంలోని సిర్సనగండ్ల, మర్పడగ గ్రామాలకు సాగునీరు అందనుంది.

ఇబ్బందులు పడుతున్నాం



సాగునీరు లేక పంటల సాగుకు ఇబ్బంది పడుతున్నాం. మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రధాన కాలువ ద్వారా ఎల్లారెడ్డిపేట వద్ద నిర్మించిన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు త్వరగా పూర్తి చేసి, మా పంటపొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

- నక్కల రాజిరెడ్డి, రైతు, పెద్దగుండవెల్లి (దుబ్బాక మండలం)